నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | SIDDIPET

గులాబీ సైనికులు దండులా కదలిరావాలి


దౌల్తాబాద్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

రాయపోల్, ఏప్రిల్ 15: వరంగల్ బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేసి తెలంగాణ ఆత్మగౌరవం చాటిచెప్పి ఢిల్లీ పార్టీలకు కనువిప్పు కలిగించేలా గులాబీ సైనికులు దండులా కదలి రావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అలవికాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రహీమొద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, నాయకులు సరువుగారి రెడ్డి, దేవేందర్, వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


దౌల్తాబాద్‌లో సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

బహిరంగ సభను సక్సెస్ చేద్దాం

మనూరు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు, ఏప్రిల్ 15: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మనూరు ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు మోసం చేసిందన్నారు. నేటికి 50 శాతం మందికి పంట రుణమాఫీ కాలేదన్నారు. రైతుభరోసా 4ఎకరాల పైన ఉన్న రైతులకు ఇప్పటికీ అందలేదన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2500, కల్యాణలక్ష్మి తులం బంగారం, పింఛన్ రూ.4000 పెంపు జాడ లేవని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల మేలు కోసం ప్రారంభించిన బసవేశ్వర పథకం పనులు కాంగ్రెస్ ప్రభుత్వంలో నత్తనడకన సాగుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు విమర్శించడం తప్పా అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్‌కు ధ్యాస లేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, మాజీ ఎంపీటీసీ ముజామ్మిల్, మాజీసర్పంచ్ శివాజీ రావు పాటిల్, నాయకులు నాగేందర్‌రావు, జనార్దన్‌రెడ్డి, సుధాకర్, చందర్, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మనూరుకు చెందని బీఆర్ఎస్ కార్యకర్త జూకంటి సాయిలు గుండెపోటుతో మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హామీలపై కాంగ్రెస్‌ను ప్రశ్నించాలి

- వరంగల్ సభను జయప్రదం చేయాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, ఏప్రిల్ 15: హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్‌లో మండల ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ శ్రేణులు పోరాటం చేయాలన్నారు. జై కేసీఆర్... జై తెలంగాణ అనే నినాదాలతో ఊరుకో బస్సునిండా వరంగల్ సభకు తరలి రావాలన్నారు. మనోడు అన్నవాడే, జెండాపట్టినవాడే, పార్టీకోసం ప్రాణమిచ్చేవాడే బస్సు ఎక్కాలన్నారు. అటు ఇటు కాని వాళ్లకు పార్టీలో స్థానంలేదన్నారు. ఊరికో 5 మెన్ కమిటీ వేసుకొని, నిఖార్సయిన బీఆర్ఎస్ కార్యకర్తలను గుర్తించుకొని, వరంగల్ సభ దద్దరిల్లేలా వర్గల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఇప్పటి నుంచి ఫోన్‌లో కేసీఆర్ ఫొటోలతో కూడిన వరంగల్ సభకు సంబంధించిన వీడియోలను,బీఆర్ఎస్ పార్టీ ఫొటోలను డీపీలుగా, స్టేటస్‌గా ప్రతి కార్యకర్త పెట్టుకోవాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి సూచించారు. అనంతరం వరంగల్ సభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి,మాజీ ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, జయపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వర్గల్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు

ఊరూరు కదలి రావాలి

బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 15: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులతో ఆమె స్వయంగా వాల్ రైటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పల్లె నుంచి రజతోత్సవ సభకు తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 14ఏండ్లు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కన్వనర్ మామిళ్ల అంజనేయులు, కో కన్వీనర్లు గడ్డమీది కృష్ణాగౌడ్, జుబేద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, గౌస్ ఖురేషి, బీఆర్ఎస్ నాయకులు ఫాజిల్, రంజిత్ నాయక్, లడ్డూ నాయక్ ఉన్నారు.

మెదక్‌లో వాల్ రైటింగ్ రాస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఆలస్యం.. రోగులకు శాపం!

- బీఆర్ఎస్ హయాంలో రూ.184.87 కోట్లు మంజూరు
- శంకుస్థాపన చేసిన నాటి సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ హయాంలో పనులు పరుగులు పెట్టించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- కాంగ్రెస్ వచ్చాక ఆగిపోయిన పనులు
- అందుబాటులోకి వస్తే వేలాది మంది కార్మికులు, పేదలకు సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి పట్టించుకోవాలని పేదల విజ్ఞప్తి

పటాన్‌చెరులో సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవన నిర్మాణం పూర్తయ్యేనా..

పటాన్‌చెరులోని ప్రభుత్వ దవాఖాన

పటాన్‌చెరులో కొనసాగుతున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15 : వేలాది పరిశ్రమలు, లక్షలాది కార్మికులకు నిలయమైన పటాన్‌చెరుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖాన మంజూరు చేసింది. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు సైతం ప్రారంభించింది. ఈ ప్రాంత కార్మికులు, పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించేందుకు నాటి సీఎం కేసీఆర్ రూ.184.87 కోట్లు మంజూరు చేశారు. 2023న జూన్ 22న స్వయంగా కేసీఆర్ దవాఖాన పనులకు శంకుస్థాపన చేశారు. నాటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వేగంగా ఈ దవాఖాన పనులు చేయించారు. అంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రావడంతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనులకు గ్రహణం పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. కేసీఆర్‌కు క్రెడిట్ రావద్దనే కాంగ్రెస్ ప్రభుత్వం దవాఖాన పనులు ఆలస్యం చేస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

కార్మికులు, పేదలను దృష్టిలో ఉంచుకొని దవాఖాన మంజూరు...

పటాన్‌చెరు ప్రాంతం హైదరాబాద్‌కు సమీపంలో ఉండడం, పారిశ్రామిక వాడలు ఉండడంతో ఎక్కవ మంది కార్మికులు నివాసం ఉంటున్నారు. అంతేకాకుండా చాలామంది పేదలు ఈ ప్రాంతంలో వివిధ పనులు చేసుకుని బతుకుతున్నారు. వీరందరికీ కార్పొరేట్ వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ దవాఖాన నిర్మాణ పనులు ప్రారంభించింది. పటాన్‌చెరు ప్రాంతంలో అనేక రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. అంతేకాకుండా కార్మికులు అనారోగ్యానికి గురైతే ఇక్కడి సర్కారు దవాఖానను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇక్కడ పెద్దవైద్యం అందడం లేదు. దీంతో పాటు పటాన్‌చెరు సర్కార్ దవాఖానకు రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖాన అందుబాటులోకి వస్తే కార్మికులు, పేదలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది.

అసంపూర్తిగా పనులు

పటాన్‌చెరులోని 200 పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవన నిర్మాణం పూర్తి చేసి రంగులు వేశారు. దవాఖాన లోపల రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించడం, రోగుల కోసం బెడ్లు, ఆక్సిజన్ పైపులైన్, రోగులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దవాఖానలో రోగులకు అత్యవసర పరిస్థితిలో కార్పొరేట్ స్థాయిలో చికిత్సలు అందించేందుకు భవన నిర్మాణ సమయంలో ప్రత్యేక గదులు నిర్మాణం చేసేందుకు ప్రణాళిక చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను చూపడంతో దవాఖాన అందుబాటులోకి రావడం లేదు. జిల్లాకు చెందిన దామోదర రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్పందించి సూపర్ స్పెషాలిటీ దవాఖానలో అన్ని పనులు పూర్తిచేసి తమకు అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు కోరుతున్నారు. పటాన్‌చెరు దవాఖానకు ప్రతిరోజు వందల సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తున్నారు. పాత భవనంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ దీని మీద దృష్టి సారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమస్ఫూర్తితో సభకు తరలిరావాలి

- కేసీఆర్ కృషితో గజ్వేల్ అభివృద్ధి
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో చలో వరంగల్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఉద్యమ స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ఎల్కతుర్తి సభా ప్రాంగణానికి తరలి రావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలోని శోభా గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ సహకారంతో గజ్వేల్ మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని, అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న పనులకు 16నెలల కాలంలో కాంగ్రెస్ పూర్తి చేయలేకపోయిందన్నారు. అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని చెప్పిన నాయకులు ఎక్కడా కనబడడం లేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గజ్వేల్‌లో వేసవి వచ్చిందంటే తాగునీటికి బిందెలతో కొట్లాడిన పరిస్థితులను చూశామని, కేసీఆర్ ఆడబిడ్డలకు మంచినీటి సమస్య రావద్దనే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ద్వారా శుద్ధిచేసిన నీళ్లను ఇస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్‌లో సమీకృత మార్కెట్, ఆర్డీవో కార్యాలయం, అద్భుతమైన రోడ్లు, ఎడ్యుకేషన్ హబ్, రింగ్‌రోడ్డు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, బట్టర్ ఫ్లై లైట్లు, కుల సంఘాల భవనాల నిర్మాణాలతో పాటు అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం ఛలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు జకీయొద్దీన్, కొట్టాల యాదగిరి, జాఫర్‌ఖాన్, సురేశ్, ప్రతాప్‌రెడ్డి, మంజుల పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకత

- కేసీఆరే సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారు
- వరంగల్ సభకు భారీగా తరలివెళ్దాం
- పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

ముత్తంగి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి..సంక్షేమ పాలన మళ్లీ రావాలని ప్రజలంతా కోరుతున్నారని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పటాన్‌చెరు పట్టణ, గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, కొలన్‌బాల్‌రెడ్డి, గడీల కుమార్‌గౌడ్ బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరులో బీఆర్ఎస్ పటిష్టంగా ఉందన్నారు. తొమ్మిది నెలల క్రితం ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు పార్టీలో కొంత అయోమయ పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, పటాన్‌చెరులో బీఆర్ఎస్‌కు బలమైన శక్తిగా మార్చిన నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడలేదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధను పెట్టి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామన్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్దామని పిలుపునిచ్చారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రసంగం వినడానికి ప్రజలు ఆసక్తితో ఉన్నారని, సభను విజయవంతం చేసేందుకు అందరం గట్టిగా శ్రమిద్దామన్నారు. మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. వరంగల్ సభతో బీఆర్ఎస్ విజయోత్సవ యాత్రలకు సిద్ధం అవుతుందని, కాంగ్రెస్ పార్టీ నిమజ్జన యాత్రకు సిద్ధం కావాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు కొలన్‌బాల్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, శ్రీధర్‌చారి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, మోటే కృష్ణయాదవ్, మాణిక్‌రెడ్డి, మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చందు ముదిరాజ్, మెరాజ్‌ఖాన్, కిట్టుముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌యాదవ్, తొంట అంజయ్య, సందీప్, విష్ణువర్ధన్ రెడ్డి, సిల్వరి శ్రీనివాస్, రామకృష్ణ ముదిరాజ్, చందు, జయశ్రీ, శ్రీవేద శ్రీనివాస్, బండరాజు, శంకర్, అజ్మేరా, పద్మమ్మ, మధుసూదన్ రెడ్డి, రవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కూలి పనిచేసిన బీఆర్ఎస్ యువజన విభాగం

రూ.3వేలు కూలి ఇస్తున్న మిర్చిబండి(హోటల్) యాజమాని

సిద్దిపేట, ఏప్రిల్ 15: సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులు కూలి పనిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి వెళ్లేందుకు నిధుల సేకరణలో భాగంగా మంగళవారం సిద్దిపేటలోని కరీంనగర్ రోడ్డులో గల గౌరీ మిర్చిబండి వద్ద ఒక్కరోజు కూలి పని చేసినట్లు తెలిపారు. ఇందుకు మిర్చి బండి యజమాని కూలీగా రూ.3000 ఇచ్చారన్నారు. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున యువజన విభాగం ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెర్క బాబు, ఆకుబత్తిని రాము, సామల సాయి ప్రేమ్, బెల్లంకొండ వెంకట్, కర్రోళ్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు గులాబీ సేన రెడీ

జహీరాబాద్‌లో వాల్‌రైటింగ్ రాస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 15: ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జహీరాబాద్ నియోజకవర్గంలోని గులాబీ శ్రేణులు భారీగా తరలిరానున్నట్లు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేలా జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రదేశాల్లో ఆయన వాల్ రైటింగ్ రాశారు. భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను పిలుపునిచ్చారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. పంట రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం, ఇతర పథకాలు సరిగ్గా అమలు కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై జనం ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రావడానికి జనం ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్ పట్టణ, మండలాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహించి, సభను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలను దిశానిర్దేశం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి వెళ్లడానికి గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించే ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నామరవికిరణ్, యాకూబ్, మోహీజొద్దీన్, తులసీదాస్‌గుప్తా, మిథున్‌రాజ్ పాల్గొన్నారు.

మట్టి రోడ్డుతో మస్తు తిప్పలు

కొల్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 2 సమీపంలో మట్టి సర్వీస్ రోడ్డు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15: ఓఆర్ఆర్‌పై ఎగ్జిట్-2 కొల్లూర్-వెలిమల సమీపంలో సర్వీస్ రోడ్డు సరిగ్గా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్-వికారాబాద్ రైలు మార్గం ఉండడంతో మధ్యలో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయలేదు. వాహనదారులు సర్వీస్ రోడ్డులో వెళ్లేందుకు ఇబ్బందులు పడడంతో తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం చేశారు. తాత్కాలిక రోడ్డు మట్టిది కావడంతో దుమ్ము ధూళి లేస్తున్నది. సర్వీస్ రోడ్డు చిన్నగా ఉండడంతో రెండు వైపులా భారీ వాహనాలు వచ్చినప్పుడు గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ఓఆర్ఆర్ నిర్వాహకులు వాహనదారులు నుంచి టోల్ వసూలు చేస్తున్నా సరైన రోడ్డు నిర్మించడం లేదు. రైల్వే పట్టాలపై బ్రిడ్జి నిర్మాణం చేసి బీటీ రోడ్డు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. వర్షం కురిస్తే మట్టి రోడ్డుపై వాహనదారులు డ్రైవింగ్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా..

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల కేంద్రం శివారులోని పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో వేళాడుతున్నాయి. వీటితో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తీగలు చేతికందే ఎత్తులో ఉండడంతో రైతులు కర్రలను ఊతంగా పెట్టి జాగ్రత్త పడుతున్నారు. కొన్ని నెలల క్రితం ఝరాసంగంకు చెందిన ఓ వ్యక్తి మేకల మేత కోసం వెళ్లి విద్యుత్ తీగలకు తాకడంతో మృత్యువాత పడ్డాడు. విద్యుత్ అధికారులు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు. – ఝరాసంగం, ఏప్రిల్ 15